ప్రయాణం

శ్రీ ఇచ్ఛాపురపు రామచంద్రం

జీవితమూ, ప్రయాణమూ ఒకటయినా కాకపోయినా, ఆ రెండిటికీ చాలా పోలికలున్నాయన్నది మాత్రం నిర్వివాదాంశమే.

వర్తమాన పరిస్థితులు—చక్కని జీవితంతో పాటు చక్కని ప్రయాణాన్నికూడా 'అరుదు'చేసి వదులుతున్నాయి.

'చక్కని జీవితం'లాగే 'చక్కని ప్రయాణమూ' మనిషి మనిషికీ నిర్వచనం మార్చుకుంటుంది.

టికెట్‌కొనని వాడికి—రైలుదిగేవరకూ టి. సి. రాక్షసుడెదురు పడకపోతే చాలు, ప్రయాణం సవ్యంగా సాగినట్లే.

టికెట్ కొన్నవాడికి—సీటు దొరికితే తృప్తి. మరికొందరికి కూర్చుందుకు జాగా దొరికినంత మాత్రాన చాలదు. పగలయినాసరే, శయనించేందుకు శయ్య కుదరాలి. అప్పుడే ఆనందం.

లోకో భిన్న రుచిః.

ఒక రైలుపెట్టెలో ప్రయాణం చేస్తున్న ప్రయాణీకులందరికీ తలో రకమయినా కోరికా! ఈ కోరికలెంత విచిత్రాలు!

తాను దిగవలసిన స్టేషనువరకూ రైలు ఆగకుండా పరుగెడితే ఎంత బాగుంటుంది!

ఈ రైలు రెట్టింపు వేగంతో శరంలా దూసుకుపోతే?

ఏమీ వద్దుకానీ, ఏ ప్రమాదమూ సంభవించకుండా భగవంతుని దయవల్ల సరిగా చేరితే చాల.

కిటికీపక్క సీటు దొరితే— సింహాసన మెక్కినట్లే ఉంటుంది కొందరికి.

దేశకాలమాన పరిస్థితులకి ప్రతిబింబం రైలుపెటె. ముఖ్యంగా— మూడో (రెండవ?) తరగతి రైలుపెట్టె.

ఈ పెట్టెలో ఉండేది — మామూలు మనుషులు.

ఇక్కడ ఎదురయ్యేది – మామూలు. జీవితం.

సగటు జీవితం సాక్షాత్కరింపజేసుకోవాలంటే రాజకీయ నాయకులదగ్గరనుంచి — రచయితలవరకూ యీ రైలుపెట్టెనే శరణు వేడాలి.

మామూలు జీవితంలో ఉండే మెలికలన్ని యీ రైలుపెట్టె ప్రయాణంలో ఉంటాయి.

లంచగొండితనం, కుట్ర, దగా, మోసం, వంచన, ఎడనెడ మంచితనం, కొంచం మానవత్వం, అడపా తడపా విశాల హృదయం, అవినీతి, నీతి— ఒకటేమిటి? అన్నీ ఎదురై పలకరిస్తాయి యిక్కడ.

ప్రతిప్రయాణమూ ఒక అనుభవమే.

ఈ రైలుపెట్టె—చిన్నప్రపంచం. చిత్రమైన ప్రపంచం. ముక్కూ మొహమూ తెలీని మనుషుల మధ్య—నిర్బంధంగా—కొంతకాలం గడపకతప్పదు.

ప్రతివాడికీ తెలుసు—రైలుదిగాక తనకీ మిగిలిన వాళ్లకీ ఎవ్విధమయిన సంబంధమూ ఉండబోదని. ఈ సహచర్యం అశాశ్వతమే అనీ తెలుసు. ఐనా—ప్రయాణీకులు సహజంగా ప్రవర్తించరు.

లేని ఔదార్యం చూపేదొకరు.

ఉండే చిరాకుని దాచుకునే దొకరు.

ముక్కు మూసుకుని తపస్సు చేసుకునే మునుల్లా మౌనందాల్చే దొకరు.

ఉన్నరంగులు దాచుకుని లేని రంగులు బయటపెడుతూ రైలుపెట్టెను నాటకరంగం చేసేది కొందరు.

ప్రపంచ జ్ఞానాన్ని దిగుమతి చేసుకుందుకు చాలా అవకాశాలిస్తుంది రైలుపెట్టె.

అటువంటి ఒకానొక రైలుపెట్టెలో—

నిమ్మకు నీరెత్తినట్లు కూర్చున్నాడతను. అతనే మన కథకి నాయకుడు.

రైలెక్కిన కొంతసేపటివరకూ నలుగురినీ పరికించి నాలుగుమాటలూ విన్నాడు.

కిటికీ పక్కసీటు దొరికింది.

ప్రయాణీకుల పాలిటి దేవేంద్ర పదవివంటిదే కిటికీ పక్కసీటంటే.

ఇంకేముంది? అతను మిగిలినవారిమాట మరిచిపోయాడు. హాయిగా కూర్చుని మోచేతులు కిటికీలో ఆన్చి— అవతలకు చూడసాగాడు.

రైలు ముందుకు పరుగెడుతూంటే — కొండలూ చెట్లూ ఓటమితో తలవంచుకుని వెనక్కిపోతున్న దృశ్యం.

ఆ గెలుపంతా తనదే అయినట్లు ఆనందం.

సిగ్నల్సూ, రాబోయే స్టేషనూ ముందే కనిపిస్తాయి.

రైలు దిగకుండా ఏం కావాలంటే అవి కొనుక్కోవచ్చు దగ్గరకి పిలిచి. ఎవ్విధమయిన ఆత్రుతా లేకుండా ప్లాట్‌ఫారం చూడవచ్చు. ఎవరేనా తెలిసినవారు కనిపిస్తే పిలిచి—దర్జాగా కబుర్లు చెప్పొచ్చు. ఇవన్నీ కిటికీ పక్కసీటిచ్చే సుఖాలు. ఐతే — బొగ్గు నలుసులు కళ్లల్లో పడడంవంటి చిన్నచిన్న దుఃఖాలు కూడా ఎదుర్కోవలసి ఉంటుంది. ఎండ, వాన— కిటికీ పక్కసీటుని వెక్కిరించినా వెక్కిరించవచ్చు. ఇవికాక — 'ఆ తలుపు మూస్తారూ మాస్టారూ?'

'ఆ కాఫీ గ్లాసందుకొండి' ఈ కాళీగ్లాసిచ్చెయ్యండి ప్లీజ్' 'ఆ పాన్ వాలాని కేకెయ్యరూ'? వంటి యాత్రి బాధలుకూడా భరించవలసి ఉంటుంది కిటికీప్రక్క సీటు.

ఐతే-

వాతావరణం చక్కగా ఉండడాన అతను కూర్చున్న కిటికీపక్క సీటు మరింత సుఖంగా ఉంది. ఎండలేదు మేలి ముసుగు కప్పుకున్న జవరాలి ముఖంలా ఉన్నాడు మబ్బుల వెనుక సూర్యభగవానుడు. ఆకాశం అందమైన అమ్మాయి కట్టుకున్న రంగుల డిజైన్ల చీరలా ఉంది—రంగుల మబ్బులతో.

పచ్చని పొలాలు. మనోహరమయిన దృశ్యాలు. అన్నీ అనుభవించేస్తున్నాడతను— యితరులు మరింత అసూయపడే టట్లు.

ఉండుండి దేనిగురించో దీర్ఘాలోచనలో పడుతున్నాడు.

అంతలోనే మళ్లీ ఉలిక్కిపడి సర్దుకుంటున్నాడు. ఏదో గొణుక్కుంటున్నట్లు అతని పెదవులు కదులుతున్నాయి ఒక్కొక్కసారి.

రైలు పరుగెడుతూంది.

అది చేస్తున్న శబ్దం క్రమబద్ధం కావడాన అదీ లయప్రధానమైన సంగీతమే ఐ హృదయాలను తాకి ప్రకంపనాలు చెలరేపుతూంది.

రైలుతోపాటే కాలమూ పరుగెడుతూంది.

రెండూ పరుగులే. ఒకటి వ్యత్యాసం. ఎట్టి పరిస్థితుల్లోనూ కాలం వెనక్కి జరగదు. ఆగదు.

రైలు ఆగింది. అదో చిన్న స్టేషను. ఏమీ కోలాహలం లేదు.

ఆ పెట్టెలోంచి ఎవరూ దిగలేదు. కాని—

టికెట్ ఎగ్జామినర్ మాత్రం ఎక్కాడు.

తన పెట్టెలోకి అతను ప్రవేశించాడని గ్రహించిన మరుక్షణం కథానాయకుడి ముఖంలో వింతగా మార్పు వచ్చింది. మొదట మందహాసం...అనంతరం ఆందోళన...భయం...అతను ప్రయత్న పూర్వకంగా యథాస్థితికి వచ్చాడు. ఐనా అతని ముఖంలో అసాధారణత కొట్టవచ్చినట్లు కనపడుతూనే ఉంది.

అతను కళ్లు మూసుకుని—సుదీర్ఘాలోచనలో ఉన్నాడో లేక నిద్రపోతున్నట్లు నటిస్తున్నాడో నిర్ధారించి చెప్పడం కష్టమే. ఒకసారి కళ్లు తెరిచి—లేచి అవతలకి వెళ్లబోయే ప్రయత్నం చేయబోయాడు. మళ్లీ అంతలోనే ఆ ప్రయత్నం విరమించుకున్నాడు. చాలా కాళ్లను తప్పించుకుని వెళ్లగలిగినా—టికెట్ ఎగ్జామినర్ కంటపడక తప్పదని అతనికి తెలుసు.

కిటికీ అవతలకి చూస్తూ గంభీరంగా కూర్చున్నాడు. టికెట్ ఎగ్జామినర్ రానే వచ్చాడు.

'టికెట్ ప్లీజ్...'

తనని కానట్లు ఉండిపోయాడు—అవతలకి చూస్తూ.

'టికెట్—' ఈ సారి గట్టిగా.

కథానాయకుడు చలించలేదు.

ఈసారి టికెట్ ఎగ్జామినర్ అతని భుజంమీద తట్టి మరీ అడిగాడు విసుగ్గా 'టిక్కెట్టు...'.

అతను గొణిగాడు—'కొనలేదు—'

కళ్లు చిట్లించి ఓసారి అతని ముఖం చూశాడు తప్ప టికెట్ ఎగ్జామినర్ ఆశ్చర్యపోలేదు. అతని అనుభవంలో యిటువంటివారి నెందరిని చూశాడో!

మిగిలిన ప్రయాణీకులు మాత్రం కళ్లు పెద్దవి చేసి చూశారు. మంచిబట్టలే వేసుకుని—పెద్దమనిషిలా కనపడుతున్నాడు. దర్జాగా కూర్చున్నాడు కిటికీపక్క సీటులో. తీరాచూస్తే టికెట్ కొనలేదు! డబ్బున్నవాడు ముందే పడవెక్కాడట. అలాగేఉంది వ్యవహారం—అనుకున్నారు.

'టికెట్ లేకుండా ప్రయాణం చెయ్యడం నేరమని తెలియదూ?'

'తెలుసు.' నీరసంగా అన్నాడు.

'ఎక్కడనుంచి వస్తున్నారు? ఎక్కడికి వెళ్లాలి? డబ్బుతియ్యండి.' రసీదు పుస్తకమూ పెన్సిలూ సిద్ధంగా పట్టుకున్నాడు టి. యి.

'నాదగ్గర డబ్బులేదు. నేను చాలా పేదవాడిని. కష్టాలలో ఉన్నాను.' లేచి నిలుచుని దీనంగా అన్నాడు.

అయోమయంగా అతని ముఖంచూసి—వచ్చే స్టేషనులో—మిమ్మల్ని పోలీస్ కప్పజెప్పవలసి ఉంటుంది.' నా విధి నేను నిర్వర్తించాలి ..' అన్నాడు టి. యి.

'నా పరిస్థితి వింటే—మీరంత నిర్దయగా ఉండలేరు.'

టి. యి. మౌనాన్ని అంగీకారంగా భావించి—చెప్ప సాగాడు అతను.

'నా పేరు రంగనాథం. వయసు ఏభై రెండు. ఐదేళ్లకింద---నేను చేయని నేరం నెత్తినవేసి ఉద్యోగం నుంచి తొలగించారు. కారణం—రాజకీయాలు.

ఉద్యోగం పోవడంతో పరువూ పోయింది. ప్రయివేట్లు చెప్పుకుంటూ—ఓ పూట పస్తులతో కాలం గడుపుతున్నాను.

పెళ్లీడు కొచ్చిన అమ్మాయితప్ప నాకు సంతానం లేదు. అమ్మాయి శశి—నా ఆరో ప్రాణం. నా పంచ ప్రాణాలూ—అన్నపూర్ణ. అంటే నా అర్ధాంగి. సరిఅయిన తిండిలేక—కృశించి పోయింది. ధర్మాసుపత్రికి తీసుకెడితే టి. బి. అన్నారు. మందు లిప్పించగలిగే శక్తి నా కెక్కడిది? ఇంత అసమర్థుడినయినా—అన్నపూర్ణకి నేనంటే ఎంత ప్రేమో చెప్పలేను.

మునికే నక్కమీద తాటిపండు పడ్డట్లయింది నా పని.

అమ్మాయి—ఎవరితోనో లేచి పోయింది!

నిజమే. ఏ నాటికీ యీ నాన్న తనకి పెళ్లి చేయలేడని ఆమెకు తెలిసిపోయి ఉంటుంది. నన్ను బాధపెట్టడం యిష్టంలేక తనదారి తాను చూసుకుంది.

శశి లేదు.

'నాన్నా!'

జీవితం లాటరీ అన్నది నిజమే అని నా నమ్మకం. మన యింటి పరిస్థితి నాకు పూర్తిగా తెలుసు. ఇంతకంటె మనం చెడిపోయేదీ ఏమీ ఉండదు. నా గురించి...నా భవిష్యత్తు గురించి—నువ్వూ అమ్మా ఎంత దిగులుపడుతున్నారో నేనర్థం చేసుకున్నాను. చెయ్యని నేరానికి నువ్వు శిక్ష అనుభవిస్తున్నావు. విధి విసిరేసిన జాతకాలు మనవి. అమ్మాయి పెళ్లి చెయ్యరేం అని నలుగురూ నిన్నాడి పోసుకోడం నాకు వినపడుతూనే ఉంది. ఈ మనుషులకి జాలి లేదు నాన్నా. సానుభూతీ లేదు. మీ గుండెలమీద నిప్పుల కుంపటిగా బ్రతకడం—నాకు దుర్భరమై పోతోంది: ముఖ్యంగా అమ్మ ఆరోగ్యం చెడటానికి నేనే మూలకారణమేమో అన్న—అనుమానం బలంగా పీడిస్తూంది.

అందుకు—

మీ సమస్యను పరిష్కరించేందుకు—

ఎలాగూ లాటరీయే ఐన జీవితాన్ని పణంగా పెట్టి జూదం ఆడుతున్నాను. గెలిచానో—అందరమూ సుఖపడతాం. ఓడిపోతే—మీకు తెలియనివ్వను. మీ మనసు కష్టపెట్టను.

నేను లేచిపోతున్నాను నాన్నా.

ఆశీర్వదించు. నీ దీవెనలు నాకు తప్పకుండా అందుతాయి.'

శశి ఉత్తరమే మిగిలింది మాకు.

ఆమె చేసింది తప్పు అనడానికి సాహసించలేను. అదీ నా పరిస్థితి. చాలా తెలివయిన శశి—యిలా చేసిందంటే—అందుకు తగిన కారణాలుండనే ఉన్నాయి.

నేనూ అన్నపూర్ణా మిగిలాం.

శశి గురించి-నిజం తెలియనివ్వలేదు నేను.

అప్రియమయిన నిజం చెప్పడంకంటె మౌనమే మేలు కదా?

ఇదంతా రెండు సంవత్సరాలనాటి కథ.

అన్నపూర్ణ ఆరోగ్యం మరింత చెడింది.

హాస్పిటల్లో చేర్చాను.

ఇన్నాళ్లయ్యాక శశినుంచి ఉత్తరం వచ్చింది. టెలిగ్రాం—మూడే ముక్కలు.

'నాన్నా...ఒక్కసారి...రా.'

హాస్పిటల్లో ఉండగా టెలిగ్రాం తెచ్చియిచ్చాడు మెసంజర్. అన్నపూర్ణకి విషయం తెలిసిపోయింది.

'నా ప్రాణం మీ చేతులలో తప్పపోదు. అమ్మాయి ఎలా ఉందో? చూసి రండి—'

చేతిలో చిల్లిగవ్వలేదు. ఎలా వెళ్లేది ?

నా కయితే ఆత్రతగానే ఉంది. ప్రాణంలో ప్రాణంగా పెంచుకున్న అమ్మాయి, రమ్మని ప్రాధేయ పడితే వెళ్లకుండా ఉండడం రాతి గుండెలకి తప్ప మామూలు మనిషికి అసాధ్యం.

నా మనసు తెలిసినదానిమల్లె—మంగళసూత్రం తీసి నా చేతుల్లో పెట్టింది అన్నపూర్ణ.

'పూర్ణా! బాపురుమన్నాను నేను.

'మాంగల్య బంధంకంటె— మానసిక బంధం గొప్పది.

'వేగం వెళ్లిరండి.'

మంగళసూత్రం అమ్మ బుద్ధిరాలేదు. తాకట్టు పెట్టినా విడిపించుకునే శక్తి ఉండదు.

మొండిగా రైలెక్కాను.

భగవంతుడి అనుగ్రహంవల్ల ఏ ఆటంకమూ లేకుండానే అమ్మాయి దగ్గరకు వెళ్లాను.

ఆ చిన్న పూరిగుడిసెలో — ఒంటరిగా నరక యాతన పడుతుంది శశి. నన్ను చూడగానే—అంత బాధలోనూ ఒక్కసారి ఆమె కళ్లు వెలిగాయి.

'వచ్చావా నాన్నా! పాపిష్టిదాన్ని...ఎంత శ్రమ కలిగించానో! ఈ క్షణాలలో నిన్నొకసారి చూడాలన్న కోరికను అణచుకోలేకపోయాను. క్షమించు నాన్నా. అమ్మకి నా నమస్కారాలు చెప్పు.

జీవితం లాటరీ నాన్నా. లక్ష కొకరు గెలుస్తారేమో ! నేను చిత్తుగా ఓడిపోయాను. నన్ను మరిచిపో..'

ఆరిపోయేముందు ఒక్కసారి దీపం ఉజ్వలంగా వెలుగుతుంది. శశి కన్నుల్లో వెలుగూ అంతే అయింది.

శశి జీవితం ఆరిపోయింది.

నా దుఃఖానికి అంతూ దరీ లేదు.

నా నిర్భాగ్యం గ్రహించి కాబోలు—నలుగురూ శశి శవాన్ని మురికికుండీవద్దకు యీడ్చేశారు.

అంత జరిగినా మంగళసూత్రం అమ్మలేక పోయాను.

అది నా చెయ్యిదాటితే అన్నపూర్ణ కూడా చెయ్యి దాటిపోతుందేమో అన్న భయం.

చెత్తబండీ వచ్చి శశి శవాన్ని లాక్కుపోతున్నా ఏడుస్తూ నిలబడిపోయాను.

శశి శాశ్వతంగా వెళ్లిపోయింది.

నా ఆశలన్నీ అడుగంటి పోయాయి.

ఇంక—నే నక్కడుండి చేయగలిగే దేముంది?

తిరుగుముఖం పట్టాను.

అన్నపూర్ణ ఎలా ఉందో?

నేను ప్రయాణం అయ్యేముందు డాక్టరు హెచ్చరించాడు 'ఆమె పరిస్థితి ఏమీ బాగులేదు. ఈ సమయంలో మీరు వదిలివెళ్లడం మంచిది కాదు.'

డాక్టరు మాటలు నన్ను నిలవనీయకుండా చేస్తూంటే వెంటనే స్టేషన్‌కి పరుగెత్తాను. కదులు తున్న రైలు ఎక్కేశాను.

అన్నపూర్ణ నన్ను కోరిం దేమీలేదు.

నా పేదరికాన్నీ బాధలనూ పంచుకుని అర్ధాంగి అనిపించుకుంది. ఆమె ఏకైకవాంఛ ఒక్కటే.

'మీ చేతుల్లోనే నా ప్రాణం పోవాలి.'

ఆమెకి కడుపునిండా తిండిపెట్టలేకపోయాను. వ్యాధి వస్తే మందు ఇప్పించలేకపోయాను.

ఆమె ఏకైక వాంఛనయినా తీర్చలేకపోతే భగవంతుడు నన్ను క్షమించడు.

అన్నపూర్ణ నాకోసం ఎంత అలమటిస్తూందో?

అసలే నా మనసు తడబాటు పడుతూంది.

చూడండి...దయచేసి నాప్రయాణానికి ఆటంకం కల్పించకండి. కొంచం మానవత్వంతో ఆలోచించి నా ఆవేదనను అర్థం చేసుకుని సానుభూతి చూపండి. మీ విధి నిర్వహణకు అడ్డుపడుతున్నాను. నిజమే. కాని-నిజంగా నేను నిస్సహాయుణ్ణి. నిర్భాగ్యుణ్ణి. నేను త్వరగా వెళ్లకపోతే అన్నపూర్ణ ఏమౌతుందో? ఆమెకు నే నిచ్చిన వాగ్దానం నిలుపుకోలేకపోతే .....

రంగనాథం గొంతు రుద్ధమైంది.

'కథలతోనూ కబుర్లతోనూ నన్ను కరిగించ లేరు. సిద్ధంగా ఉండండి. వచ్చే స్టేషనులో రైల్వే పోలీస్‌కి చెప్తారుగాని మీా కథ—'

'కథా! కాదు. జీవితం బాబూ, మీారు నా మాటలు నమ్మరూ?'

'నమ్మను.' కర్కశంగా అన్నాడు టి. యి.

రంగనాథం—చుట్టూ చూశాడు.

ఎవరూ తన కథ నమ్మినట్లులేదు.

ముసిముసి నవ్వులు నవ్వుతూ—' తప్పించు కుందుకు ముసిలాడు మంచి కథే కల్పించాడు. కాని—టి. యి. అతని పప్పు ఉడకనివ్వడంలేదు—' అని గొణుక్కుంటున్నారు.

'ఈ మంగళసూత్రం తీసుకుని—నన్ను వదిలెయ్యండి.' అంటూ జేబలో చెయ్యిపెట్టాడు రంగనాథం.

మరుక్షణం అతని ముఖం పాలిపోయింది.

'అయ్యో!' అంటాడతను.' నా మంగళ సూత్రం ఎక్కడో పోయింది. రైలెక్కే తొందరలో ఎక్కడ జారిపోయిందో?' చెప్పలేనంత ఆవేదన నిండి ఉందతని స్వరంలో.

రైలు ఆగింది.

ఏమీా జరగనట్లే లేచి—రంగనాథంని ఉద్దేశించి 'ధిగండి—' అన్నాడు టికెట్ ఎగ్జామినర్.

'నన్ను వదిలిపెట్టరూ?' కడసారి ప్రయత్నంగా ప్రాధేయపడుతూ చూశాడు రంగనాథం.

'నన్ను విసిగించక—పదండి.'

టికెట్ ఎగ్జామినర్ చెయ్యి భుజంమీాద పడబోతూంటే—'ఆగండి' అన్నాడు రంగనాథం. త్వరత్వరగా జేబులోంచి పర్సుతీసి - టికెట్‌లాగి అతని చేతిలో పెట్టాడు..

ఈ సారి టి. యి. ఆశ్చర్యంగా చూశాడు. మరునిముషం అవమానించబడిన వాడిలా—'టిక్కెట్ కొనికూడా ఎందుకలా చేశారు?' అన్నాడు కోపంగా.

రంగనాథం నవ్వాడు.

ఒకటికి రెండుసార్లు టికెట్‌చూసి—ఛేక్‌చేసి వాపసుచేసి—కదిలాడు.

అతనివెంట రైలుదిగి - మరొక పెట్టెలో ఎక్కాడు రంగనాథం.

రైలు కదిలింది—ప్రయాణం సాగించడానికి.

* * *

వేదిక చక్కగా అలంకరించబడింది.

విద్యుద్దీపాలు కాంతి విరజిమ్ముతున్నాయి.

సభ కిటకిటలాడడం లేదు. పల్చగా ఉంది. యువ రచయితలూ, సాహిత్యాభిమానులూ మాత్రమే హాజరయిన సాహితీ సభ అది.

వక్తలొక్కొక్కరూ సాహిత్యాన్ని పైకెత్తేస్తున్నారు.

మధ్య మధ్య రంగనాథాన్ని పొగిడేస్తున్నారు. ఆ నాటి సభకి ముఖ్య అతిథి—ప్రసిద్ధ కథకుడు రంగనాథం.

'ఇప్పుడు—ప్రముఖ కథా రచయిత శ్రీ రంగనాథంగారు యువ రచయితలకు సందేశం యిస్తారు.'

రంగనాథం లేచి నిలబడ్డాడు.

'సభకి — నా నమస్కారాలు. ఇంతసేపూ వక్తలు నన్ను పొగిడారు. నా కథా కథన కౌశలాన్ని కొనియాడారు. అందుకు కృతజ్ఞుణ్ని. కాని—చేదుగా ఉన్నా ఒక్కనిజం చెప్పవలసిన బాధ్యత నా మీాద ఉంది. అనుభవం తెలియజేసిన సత్యమది.

పాఠకులూ పత్రికలూ నన్ను గొప్ప రచయితగా అభినందిస్తూంటే అదంతా నిజమే అనుకుని గర్వ పడుతూ వచ్చాను. కాని—యివాళ యిక్కడికి చేసిన ప్రయాణంలో ఒక వింత జరిగి—నా కళ్లు విడ్డాయి. టికెట్ కొననట్లు నటించి—టికెట్ కలెక్టర్‌కి చిక్కని కథ చెప్పాను. కాని - అతను కరగలేదు. నా కథా కథనం అతన్ని కొంచమయినా చలింపజెయ్య లేదు. నా కథ నిన్న ప్రయాణీకులుకూడా నమ్మలేదు.

నా గర్వం అణిగి పోయింది.

నేను మంచి కథకుడినా, కానా? అన్న పరీక్షలో ఓడిపోయాను.

అయితే—ఈ ప్రయాణం నాకు మేలే చేసింది.

నేను చేసిన ప్రయాణం — అసత్యంనుంచి సత్యానికి.

నేను మీాకివ్వ గలిగే సందేశం ఏమీా లేదు. జీవితానికి—తీయని భ్రమలకంటే— చేదు అయిన నిజాలే ఎక్కువ మేలు చేస్తాయి.

ఇంతకంటె నేనేమీ చెప్పలేను. క్షమించండి.

రంగనాథం వేదిక దిగి పోయాడు.

తరువాత రంగనాథం మళ్లీ కథ వ్రాయలేదు.